

తెగుళ్లను గుర్తిస్తుంది.. పరిష్కారాలు చూపుతుంది..

● చిత్రాలు పంపితే చీడపీడల గుర్తింపు ● కేంద్ర ప్రభుత్వ ఎన్‌పీఎస్ఎస్ మొబైల్‌యాప్‌తో అనేక లాభాలు

సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది.. వ్యవసాయంలోనూ ప్రస్తుతం అనేక ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా సెల్‌ఫోన్ వచ్చాక ప్రతీది అరచేతిలోనే తెలిసిపోతోంది. పంటల రక్షణకు సస్యరక్షణ చర్యలు ఎలా చేపట్టాలో సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకునేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుకు అనుగుణంగా స్మార్ట్ ఫోన్‌లో పంటల రక్షణ చర్యలపై ఎన్‌పీఎస్ఎస్ అనే ఆప్ విడుదల చేసింది.



వాంకిడి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పంటలను ఆశించే చీడపీడల నివారణకు సత్వర సలహాలు, సూచనలు పొందడానికి వీలుగా కేంద్రప్రభుత్వం ఓయాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైన్, స్టోరేజ్ కార్యాలయం, ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సహకారంతో నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం (ఎన్‌పీఎస్ఎస్) పేరిట జాతీయ చీడపీడల నిఘా వ్యవస్థ అనే మొబైల్‌యాప్‌ను సిద్ధం చేసింది. దీన్ని రైతుల దరికి చేర్చే బాధ్యతను కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రానికి అప్పగించారు. జిల్లాలో కొంత మంది రైతులను ఎంపిక చేసి వారికి మొబైల్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

యాప్‌లో మూడు ప్రధాన విభాగాలు..

ఈ యాప్‌లో ప్రధానంగా మూడు విభాగాలు ఉన్నాయి. చీడపీడల గుర్తింపు విభాగం(పెస్ట్ ఐడెంటిఫికేషన్ మాడ్యుల్), చీడపీడల నిఘా విభాగం (పెస్ట్ సర్వైలెన్స్ మాడ్యుల్), సలహాల విభాగం (అడ్వైజరీ మాడ్యుల్) చీడపీడల గుర్తింపు విభాగంలో 61పంటలకు సోకే చీడపీడలు, తెగుళ్లను గుర్తించవచ్చు. రైతు నేరుగా మొబైల్ ద్వారా పురుగు లేదా తెగుళ్ల చిత్రాన్ని తీసి యాప్‌లో అప్లోడ్ చేస్తే వెంటనే పురుగు లేదా తెగులును గుర్తించి దాని లక్షణాలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల సమాచారాన్ని అందజేస్తుంది. చీడపీడల నిఘా విభాగంలో ప్రస్తుతానికి వరి, పత్తి, సోయా, మిర్చి, మొక్కజొన్న, వంగ, దానిమ్మ, ఆపిల్, అరటి, ద్రాక్ష, మామిడి, కంది, చెరకు, టమాట, మినుము, గోధుమ పంటలలో కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతి సమాచారాన్ని సమోదు చేయవచ్చు. రాబోయే కాలంలో మిగిలిన పంటలను కూడా చేర్చే అవకాశామున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ విభాగంలో క్వాంటిటేటివ్, క్వాలిటేటివ్ అనే రెండు భాగాలున్నాయి. క్వాంటిటేటివ్ భాగంలో ఎంపికచేసిన రైతులకు యాప్ ఐడీ, పాస్‌వర్డ్‌ను అధికారులు అందజేస్తారు. వారు మాత్రమే ఈ భాగాన్ని ఉపయోగించవచ్చు. ఇక క్వాలిటేటివ్ భాగంలో ఐడీ, పాస్‌వర్డ్ అవసరం లేకుండానే ఉపయోగించే అవకాశం ఉంటుంది. ఇక మూడోది సలహాల విభాగంలో రైతుల ఎన్‌పీఎస్ వెబ్‌పోర్టల్ నుంచి నిపుణుల సలహాలను చూడవచ్చు.

ప్రయోజనాలు..

- ఈ యాప్‌వల్ల సకాలంలో చీడపీడలను గుర్తించి నివారణకు సత్వర సమాచారాన్ని పొందవచ్చు. రైతులకు ఖర్చులు తగ్గి దిగుబడులు పెరిగి తద్వారా లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుంది.
- పురుగుల వ్యాప్తిని త్వరగా కనిపెట్టి నిరోధించవచ్చు.
- ఒక ప్రాంతంలోని ముఖ్య పంటల్లో ఉన్న చీడపీడల చారిత్రక సమాచారం నమోదు ద్వారా రాబోయే రోజుల్లో పంటల సంరక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది.
- చీడపీడలు, తెగుళ్ల సమాచారం అందుబాటులో ఉంచడం ద్వారా విధానకర్తలు వ్యవసాయరంగానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి ఆస్కారం ఉంటుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

మిలింద్ కుమార్, ఏడీఏ, వాంకిడి



చీడపీడల నివారణకు, సత్వర సలహాలు, సూచనలు పొందడానికి వీలుగా కేంద్రప్రభుత్వం ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చించి. అనేకపంటలలో కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతి సమా చారం ఈ యాప్‌లో ఉంటుంది. రైతు నేరుగా మొబైల్ ద్వారా పురుగు లేదా తెగుళ్ల చిత్రాన్ని తీసి యాప్‌లో అప్లోడ్ చేస్తే వెంటనే గుర్తించి దాని లక్షణాలు, చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యల సమాచారాన్ని అందజేస్తుంది. రైతులు పండించే పంటల దిగుబడులు పెంచేందుకు అనుకూలమైన ఈ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లు దీపక్‌తివారి, డేవిడ్, ఏఎస్పీ ప్రభాకర్ రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి గణతంత్ర వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జరగనున్న వేడుకలను అధికారులు సమన్వయంతో కృషిచేసి విజయవంతం చేయాలన్నారు. ఈనెల24వరకు ప్రశంసాపత్రాలు సిద్ధం చేయాలన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభించనున్నందున తగుఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రశంసాపత్రాలు, శకటాల ప్రదర్శన, ఆయాశాఖలకు సంబంధించిన స్టాళ్ల ఏర్పాటు, దేశభక్తి గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు ఇతర అన్ని కార్యక్రమాల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. అదనపుకలెక్టర్ వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు.

జిల్లా ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి..

జిల్లాలో ప్రజలఆరోగ్యానికి ప్రత్యేకచర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడ గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్, నాబార్డు, జిల్లా గ్రామీణాభి వృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరానికి నాబార్డుఅధికారి కౌశిక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి సీతారాంనాయక్‌తో కలిసి హాజయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. మెగా వైద్యశిబిరంలో రక్తపోటు, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులు అందిస్తామని తెలిపారు.

నాబార్డు ద్వారా ఆసిఫాబాద్ మండలకేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ అంశంపై గిరిజన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు స్థానికంగా ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుం టామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు, ప్రతిమ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగో లింగో దీక్ష తీసుకున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



జంగో లింగో దీక్ష స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాం ఘనసంస్థాన్‌లో సోమవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ జంగోలింగో దీక్ష తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంగుబాయి ఆదివాసులకు ఆరాధ్య దైవమన్నారు. జంగోలింగో దీక్షలు తీసుకోవడంతో కష్టాలు దూరమవుతున్నాయన్నారు. నెలరోజులపాటు ఆదివాసులు దీక్షల్లో ఉండటంతో తమకు శుభం కల్గుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ కుంర భగ్వంత్ రావ్, అధ్యక్షుడు రఘునాథ్, దీక్షాపరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు శ్రీనివాస కల్యాణోత్సవ ఆహ్వానం..

ఆసిఫాబాద్: కెరమెరి మండలం అనార్‌పల్లి గ్రామంలో ఈనెల31న శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే శ్రీనివాస కల్యాణానికి హాజరుకావాలని సోమవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి, అదనపుకలెక్టర్లు దీపక్‌తివారి, డేవిడ్‌కు ఆలయకమిటీ నిర్వాహకులు ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ధన్‌రాజ్, రూప్‌లాల్, వెంకట్, సురేష్, రాహుల్, విజేష్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

కాగజ్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం వంజీరిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఎంపీడీవో రమేష్ పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డు సర్వేల వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కౌటాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తంపేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ రవి దపంతులతోపాటు పలువురు ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు విశ్వనాథ్, నానయ్య, నాయకులు హర్షద్ హుస్సేన్, శ్రీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేయండి

కెరమెరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నేటినుంచి 24వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ గ్రామసభలు నిర్వహిస్తున్నామని, వాటిని విజయవంతం చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ అభయహస్తం, రైతు భరోసా పథకాలపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంఈవో ప్రకాష్, ఏపీవో మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు..

సిర్పూర్(యు): మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 21నుంచి 24వ తేది వరకు రైతు భరోసా,రేషన్ కార్డులు, ఇందిర్మఇండ్ల గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఉదయ్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న పాములవాడ, భూర్నూర్(బి),పూల్లర,బాబ్జీపెట్, 22న కోహినూర్(బి),సిర్పూర్(యు),సీతాగోండి,పంగడి, 23న శేట్టిహాడ్పూనూర్, రాఘపూర్, ధరోర(పి),పవర్‌గూడ, 24న నేట్నూర్, మహగాం, బాండేయేర్‌లలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

చింతలమానేపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి కేజీబీవీ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్టీమాథ్స్, కెమెస్ట్రీపోస్టులకు గెస్ట్‌ఫ్యాకల్టీగా బోధించడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌వో ఆర్ శ్రీజానందిని ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైనవారు ఈనెల23లోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

గోండి ధర్మకాలంను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న జాతీయ ఉపాధ్యక్షుడు ఆర్క మాణిక్‌రావు

సిర్పూర్(యు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): గోండులకు గతంలో ఉన్న గోండి ధర్మకాలంను కేంద్రప్రభుత్వం పునరుద్ధరించాలని గోండ్వాన గోండ్ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు ఆర్క మాణిక్‌రావు కోరారు. మహారాష్ట్రలోని అమరావతి జిల్లా గోవింద్‌పూర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ గోండ్వాన గోండ్ మహాసభ సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈ సభలో గోండు సమాజానికి సంబంధించిన అనేక కీలక అంశాలపై చర్చించడమే కాకుండా కొన్ని ముఖ్యమైన తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లడుతూ ఆదివాసీలు తమ ఐక్యత,హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు నాణ్యమైన విద్యకోసం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని 21 రాష్ట్రాల నుంచి సభ్యులు,ఆదివాసీ సంఘాలు, విద్యావేత్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు రాంచంద్ర నైతం, జాతీయ ప్రధాన కార్యదర్శి తరున్ నైతం, మహారాష్ట్ర అధ్యక్షుడు ప్రహ్లాద్ సిడం, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం ఆనంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు పేదవారినే గుర్తించండి

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్



సిర్పూర్(టి)లో ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్

సిర్పూర్(టి)/కౌటాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నిష్పాక్షికంగా పేదవారినే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుడిగా గుర్తించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం సిర్పూర్(టి), కౌటాలమండల కేంద్రాల్లో ఇందిరమ్మగృహ నమునా నిర్మాణానికి ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల్లో నిజమైన పేదవారిని గుర్తించాలని ఆదేశించారు. రైతుభరోసా, రేషన్‌కార్డు, ఆత్మీయ భరోసా పథకాల అమలులో ప్రజల్లో ఇంకా అపోహలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులకు ఎంతోమంది దరఖాస్తు చేసుకున్నారని కానీ మంజూరైంది మండలానికి 800లేనని అన్నారు. ఇంకా ఎంతోమంది అర్హులు ఉన్నారని వారిని కూడా అధికారులు గుర్తించాలన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను ఒక్కొక్కటి ప్రజలకు లబ్ధి చేకూరేలా కృషి చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, ఆత్మీయభరోసా పథకాలు నిరంతరం కొనసాగుతాయని రాని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామసభల్లో దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా అవకాశం ఉంటుందన్నారు. కార్యక్ర మంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, డీఈ వేణుగోపాల్, జేఈ సజియోద్దీన్, ఏవో గిరీష్ కుమార్, కౌటాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, విశ్వనాథ్, నానయ్య, విజయ్, ఎంపీడీవో ప్రసాద్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్..

దరఖాస్తుల గల్లంతుపై ఫిర్యాదు

సిర్పూర్(టి), జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆరునెలల క్రితం ప్రభుత్వం ఆరు సంక్షేమ పథకాల అమలుకు ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులు గల్లంతయ్యాయని మండలానికి వచ్చిన ఎమ్మెల్యే హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్‌కు ఎస్సీకాలనీ ప్రజలు ఫిర్యాదుచేశారు. అప్పటి అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, ఆ జాబితానే ప్రామాణికంగా ఇప్పుడు సర్వే చేస్తున్నారన్నారు. కానీ అందులో తమ పేర్లు లేవని వారి దృష్టికి తీసుకువచ్చారు. కొంతమంది ఉపాధిహామీ కూలీలపేర్లు ఆత్మీయభరోసాలో రాయలేదన్నారు. దీంతో తాము నష్టపోయామని వారి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన వారు అర్హులైన వారందరికీ న్యాయం చేస్తామన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ

బెజ్జూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమఉన్నత బాలికల పాఠశాలను శనివారం జాతీయ మానవహక్కుల సభ్యుడు ఆత్రం లింగోరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డైట్ మెనూ, టీచర్స్ అవైలబులిటీ గురించి తెలుసుకున్నారు. పాఠశాల సిబ్బంది కంపౌండ్ వాల్, క్రీడామైదానం, సోలార్‌హీటర్ తదితర సమస్యలను ఆయనకు తెలియజేశారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సర్‌మెడి ప్రభాకర్, రమేష్, ప్రశాంత్, సత్యవన్, గణేష్, శ్రీహరి, సత్యం తదితరులు ఉన్నారు.

రేపు శోభాయాత్ర

ఆసిఫాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి ఏడాది పూర్తైన సందర్భంగా ఆసి ఫాబాద్ జిల్లాకేంద్రంలో ఈనెల22న శ్రీరామ హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహిస్తామని కన్వీనర్ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు విద్యుత్ అదాలత్

కౌటాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కౌటాల సబ్‌స్టేషన్‌లో ఈనెల22న విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఏఈలు ప్రేం కుమార్, ఇర్ఫాన్, అంజల్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కౌటాల, సిర్పూర్(టి), చింతలమానేపల్లి, బెజ్జూరు, పెంచికలపేట మండలాల విద్యుత్ వినియోగదారులు అదాలత్‌ను సద్వినియగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థినులకు అవగాహన సదస్సు

కౌటాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట గ్రామంలోని ఉన్నతపాఠశాలలో సోమవారం షీటీం సభ్యులు విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైం తదితరాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో కాగజ్‌నగర్ షీటీం (8712670565)ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ధర్మయ్య, షీటీం సభ్యులు రమాదేవి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



రిలే దీక్షలు చేపడుతున్న ఆర్టిజన్ కార్మికులు

ఆసిఫాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్స్ కార్మికులను పూర్తిస్థాయిలో రెగ్యులర్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ అధ్యక్షుడు మారుతి, కన్వీనర్ నసీరుద్దీన్ అన్నారు. రాష్ట్రకమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట సోమవారం రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో కాంట్రాక్టు కార్మికులను పూర్తిస్థాయిలో రెగ్యులర్ చేసి అన్ని ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘంనాయకులు బుచ్చిబాబు, వామన్, ఏకాంబరం, శంకర్, ప్రేంసాగర్, సత్యం, కమలాకర్, బర్కత్, అశోక్, రామయ్య, శ్రీనివాస్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వేతనాలు జీవో నం.60 ప్రకారం చెల్లించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీగా ఏర్పడి 11నెలలు గడిచినా జీవోప్రకారం వేతనాలు ఇవ్వడం లేదన్నారు. విషయం తెలుసుకున్న కమిషనర్ భుజంగరావు అక్కడికి చేరుకుని నెల రోజుల్లోపు జీవోనం.60ప్రకారం వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, రాజు, సమ్మయ్య,శ్రీకాంత్,దినకర్,కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిగ్రీ ఉత్తీర్ణులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ బ్యాంకింగ్ రంగాలలో రిక్రూమెంట్ ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సజీవన్, బీసీ స్టడీ సర్కిల్ సంచాకులు ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 15నుంచి నాలుగునెలల ఉచితశిక్షణ పారరంభిస్తామని తెలిపారు. ఈనెల 20నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.


ఊట్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన ప్రవీణ్‌కుమార్



ఊట్‌పల్లిలో బోరింగ్ నీటిని పరిశీస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం ఊట్‌పల్లి గ్రామాన్ని సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని పరిశీలించారు. అనంతరం వివిధ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామానికి మిషన్‌భగీరథ నీళ్ల రావటం లేదన్నారు. దీంతో గిరిజనులు తాగునీటికి ఇబ్బం దులు పడుతున్నారన్నారు. వందమంది చిన్నారులున్న గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ దిక్కేలేదన్నారు. రేషన్ బియ్యం తెచ్చుకోవటానికి కూడా కాగజ్‌నగర్ మండలానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. సమావేశంలో నాయకులు కొండరాం ప్రసాద్, ఆవుల రాజ్‌కుమార్, బండి వాసు, కిషోర్, కార్తీక్, తదితరులున్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



బెజ్జూరులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కౌటాల/సిర్పూర్(టి)/బెజ్జూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లామహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడి రాములుపై గతనెలలో కొందరువ్యక్తులు దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ సోమవారం కౌటాల, సిర్పూర్(టి), బెజ్జూరు మండలాల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఆయా కార్యక్రమాల్లో తెలంగాణ టీచర్స్ యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో 6.5డిగ్రీల ఉష్ణోగ్రత

ఆసిఫాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిర్పూర్(యు) మండలంలో సోమవారం రాష్ట్రంలోనే అత్యల్పంగా 6.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. జిల్లాలోని మిగితా మండలాలైన తిర్యాణి మండలం గిన్నెధరిలో 6.6డిగ్రీలు, కెరమెరిలో 9.7డిగ్రీలు, వాంకిడిలో 10.5డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



జిన్నింగ్ మిల్లులో దగ్ధమవుతున్న పత్తి

జైనూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సగ్రహన్ జిన్నింగ్ మిల్లులో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. పత్తిని మిల్లుకు తీసుకొచ్చిన ఓ వాహనం బ్యాటరీలో మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఇప్పటి వరకు సీసీఐ ద్వారా జిన్నింగ్ మిల్లులో 3వేల క్వింటాలు పత్తి కొనుగోలు చేయగా అందులో సుమారు రెండు నుంచి మూడు వందల క్వింటాలు పత్తి ధగ్దమై ఉంటుందని సీసీఐ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొన్నారు. మంటలను ఉట్నూరు, ఆసిఫాబాద్ నుంచి వచ్చిన రెండు ఫైర్ ఇంజన్లు అదుపులోకి తీసుకొచ్చాయి. ఈ సంఘటనలో సీసీఐ ద్వారా కోనుగోలు చేసిన పత్తికి ఎంతమేర నష్టం జరిగి ఉంటుందనే వివరాలను అధికారులు ధ్రువీకరించలేదు. మంటల్ని ఆర్పివేసే ప్రక్రియ కొనసాగుంతోందని విచారణ అనంతరం నష్టం వివరాలు వెల్లడిస్తామన్నారు. అగ్నిప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న ప్రజలు వందలాదిగా తరలివచ్చి మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నించారు. సంఘటన స్థలాన్ని జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ సందర్శించి ప్రమాదం వివరాలను తెలుసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తులచే పత్తి దగ్ధం

భీమిని, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మెత్యం గ్రామ శివారులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులచే గ్రామానికి చెందిన గుర్లె పోచన్నకు చెందిన 5 క్వింటాళ్లటాటాట పత్తి దగ్ధమైంది. గ్రా మస్థులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం...పత్తిపంటను కోసి మెత్యం చెన్నాపూర్ మధ్యలో గ్రామ షివారులో పత్తి చేను వద్ద సుమారు 50 క్వింటాళ్ల నిల్వ ఉంచుకున్నాడు. పత్తిలో నుంచి మంటలు రావడంతో చుట్టుప క్కల చేనులలో పని చేస్తున్న రైతులు గమనించి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గ్రామస్థులు, కుటుంబీకులు నీళ్ల చల్లి మంటలను ఆర్పడం తో అక్కడే నిల్వ ఉంచిన మిగతా పత్తి దగ్ధం కాకుండా కాపాడారు. ఈ ప్రమాదంలో పోచన్నకు చెందిన రూ. 40 వేల విలువ చేసే పత్తి పూర్తిగా దగ్ధం అయింది. అధికారులు పంచనామా నిర్వహించి తమకు నష్ట పరిహారం అందించాలను రైతు కోరుతున్నాడు.

కోడి పందాల స్థావరంపై దాడి

చెన్నూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్నారం గ్రామ సమీపంలో కోడి పందాలు ఆడుతున్న స్థావరంపై చెన్నూరు సీఐ రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఎస్ఐ వెంకటేశ్వర్లు దాడులు నిర్వహించారు. అటవీ ప్రాంతంలో కోడి పందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు వెళ్లి దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి 3 పందెం కోళ్లు, 3 సెల్‌ఫోన్‌లు, 2 కత్తులు, 9 ద్విచక్రవాహనాలు, రూ. 2630 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దర్ని అరెస్టు చేయగా మరికొందరు పరారీలో ఉన్నారన్నారు. ఎవరైనా కోడి పందాలు, పేకాట ఆడితే చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాసిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసులు రామ్మూర్తిపై కేసు నమోదు చేయాలని కోరుతూ సోమవారం దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు పంగ లక్ష్మణ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ సొసైటి జిల్లా అధ్యక్షుడు అట్కపురం రమేష్ ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపై భౌతిక దాడలు చేస్తామని మాలలను రెచ్చ గొట్టే విధంగా మాట్లాడిన పసుల రామ్మూర్తిపై కేసు నమోదు చేయాలని కోరారు. అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య

బెల్లంపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంబాల రాములుపై దాడి హేయమైన చర్య అని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు అన్నారు. దాడికి నిరసనగా సోమవారం పట్టణంలోని రగగంబాల బస్తీలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుంకరి లక్ష్మీ, ఉపాధ్యాయులు స్వర్ణలత, వసంత, తిరుపతి పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో

ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభ

గర్మిళ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18 నుంచి 20 వరకు కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు మూడవ స్థానంలో నిలిచింది. జట్టును సోమవారం మంచిర్యాలలోని బాలుర ఉన్నత పాఠశాలలో అసోసియేషన్ సభ్యులు కన పర్తిరమేష్, కోశాధికారి అలుగువెల్లి రమేష్‌రెడ్డి, పీడీ రాజయ్యలు అభినందించారు. అలాగే జిల్లా హ్యాండ్ బాల్ అససియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, డీవైఎస్‌వో రాజ్‌వీరు, శృతి, వర్షలు అభినందించారు. కార్యక్రమంలో కెప్టెన్ సంతోష్, కోచ్ అరవిద్, మేనేజర్ సాయిలు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్లను డీసీపీ భాస్కర్, ఆర్‌టీవో సంతోష్, డీఈవో యాదయ్యలు సోమవారం వారి కార్యాలయాల్లో విడుదల చేశారు. మహనీయుల చరిత్రతో క్యాలెండర్లను రూపొందించడం గొప్ప విషయమని నాయకులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, నాయకులు అంజన్న, వికాస్, రాగి సూరజ్, కిరణ్, సతీష్ పాల్గొన్నారు.

- మండలంలో రేషన్ కార్డుల జాబితాపై తీవ్ర విమర్శలు..
- జాబితాలో కనిపించని అర్హుల పేర్లు..
- సర్వేలో బయటపడుతున్న అధికారుల తప్పిదాలు..
- ఆందోళనలో దరఖాస్తుదారులు..





సర్వే నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

ప'రేషన్' కార్డులు

మండలంలో రేషన్‌కార్డుల జాబితాలో గందరగోళం నెలకొంది. తమ పేర్లు రాలేదని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో గ్రామానికి కేవలం 5నుంచి 10 లేదా 15నుంచి 20 కార్డులు మాత్రమే వచ్చాయని దరఖాస్తులు విమర్శిస్తున్నారు. అన్ని అర్హతలున్నా తమ పేర్లు జాబితాలో రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చింతలమానేపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల అమలుకు అర్హుల ఎంపికలో అవకతవకలు చోటుచేసు కుంటున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ జాబితా అంతా గందరగోళంగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన సమయంలో హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు పలుసంక్షేమ పథకాలు అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 26 నుంచి ఆత్మీయ భరోసా, కొత్తరేషన్ కార్డుల జారీవంటి నాలుగు పథకాలను ప్రారంభించాలని ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల జారీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

● మండలంలో 19 జీపీలు..

మండలంలో మొత్తం 19గ్రామ పంచాయతీలుండగా, ఇందులో సుమారుగా 28వేల జనాభా ఉంది. గతంలో ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించగా కొత్తరేషన్ కార్డుల కోసం, ఇందిరమ్మ ఇళ్లకోసం, పింఛన్ల తదితర వాటికోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో సైతం ఇంటి వివరాలతోపాటు, కుటుంబ వివరాలు, వారి ఆధార్ కార్డు, భూములు తదితర వివరాలను అందించారు. చాలామంది రేషన్‌కార్డుల కోసం మండల వ్యాప్తంగా 5వేల పైనే దరఖాస్తులు చేసుకోగా మండల వ్యాప్తంగా కేవలం 911మంది పేర్లు మాత్రమే రావడంతో అర్హులు నిరాశ చెందుతున్నారు. పలు గ్రామాల్లో రేషన్ కార్డులు ఉన్న వారికి సైతం మళ్లీ లిస్టులో పేర్లు వచ్చాయి. కొన్ని గ్రామాల్లో అర్హులుగా ఉండి తమ పేరు రాకపోవడంతో వారి నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అర్హులైన వారందరికీ కార్డులు ఇవ్వాలని పేర్కొంటున్నారు.

● అసలైన అర్హులకు నిరాశే..

ఎన్నోఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చేస్తున్న పేదలు నిరాశకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డులకు నోచుకోని వారు ఈ ప్రభుత్వంపైనే భారీఆశలు పెట్టుకున్నారు. ఒక్కోగ్రామంలో వందకు పైగా దరఖాస్తులు పెట్టుకుంటే కేవలం 20-30వరకు మాత్రమే వచ్చాయని ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. ప్రతీ పథకానికి రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటుండడంతో పథకాల్లో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకున్నా..జాబితాలో పేరు లేదు..

\- ఎల్కారి దిలీప్, కర్జెల్లి



కొత్త రేషన్‌కార్డు కోసం ప్రజాపాలనలో, ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో సైతం ధరఖాస్తు చేసుకున్నా అర్హుల జాబితాలో మాపేరు లేదు. మాకు వివాహమై ఒక్కపాప ఉంది. ప్రభుత్వ పథకాల్లో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉన్నది. మాలాంటి చాలామందికి పేర్లు రాలేదు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలి.

పేర్లు రాని వారు దరఖాస్తులు చేసుకోవచ్చు..

\- కోట ప్రసాద్, ఎంపీడీవో

రేషన్‌కార్డుల కోసం గతంలో దరఖాస్తులు చేసుకొని ఇప్పుడు పేర్లు రాని వారు నేరుగా గ్రామ పంచాయతీలో కానీ గ్రామసభల్లో లేదా నేరుగా మండల కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలి. ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదు. అర్హులైన ప్రతీఒక్కరికీ రేషన్‌కార్డులు అందుతాయి.

బాల్య వివాహాలు చేస్తే

చట్టప్రకారం చర్యలు తప్పవు

● మహేష్, డీసీపీవో, ఆసిఫాబాద్



ఆంధ్రజ్యోతి: బాల్య వివాహాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీసీపీవో: జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టేందుకు గ్రామస్థాయిలో బాలల సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేశాం. ఆ కమిటీలద్వారా గ్రామాల్లో బాల్య వివాహాలు అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: వివాహం చేసుకోవడానికి అబ్బాయికి, అమ్మాయికి ఎంత వయసు ఉండాలి?

డీసీపీవో: అమ్మాయికి 18సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండినవారు వివాహం చేసుకొనుటకు అర్హులు. వివాహ ముహుర్తాలు పెట్టే సమయంలో పూజారులు తప్పని సరిగా వయస్సును నిర్ధారించి పెట్టాలి. ఆధార్ కార్డు వయస్సుకు ప్రమాణికపత్రం కాదు. అబ్బాయి, అమ్మాయి స్టడీ సర్టిఫికేట్స్ బోనఫైడ్ లేదా మార్కుల మెమో ఆధారంగా వయస్సును పరిగణలోకి తీసుకొని ముహుర్తాలు పెట్టాలి.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: బాల్యవివాహాలు చేస్తే చట్ట ప్రకారం ఎలాంటి శిక్షలు ఉంటాయి?

డీసీపీవో: బాల్య వివాహాల నిషేద చట్టం 2006ప్రకారం బాల్యవివాహం చేసినా అందులో పాల్గొన్న వారికి రెండు సంవత్సరాల జైలుశిక్ష, రూ.1లక్ష జరిమానా విధించడం జరుగుతుంది. గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే వెంటనే 1098, 112 టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలి. వెంటనే అక్కడికి జిల్లాబాలల సంరక్షణ విభాగం అధికారులు చేరుకొని బాల్యవివాహాలను జరగకుండా చర్యలు తీసుకుంటారు.

\- ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి)

గ్రామసభలకు ప్రజలు అధికసంఖ్యలో హాజరుకావాలి



వాంకిడిలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

వాంకిడి/తిర్యాణి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన గ్రామసభలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఎంపీడీవోలు ప్రవీణ్‌కుమార్, మల్లేష్ కోరారు. మండల కేంద్రాల్లోని రైతువేదికలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బందితో సోమవారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి నుంచి 24వరకు జరిగే గ్రామసభలకు ఆయా గ్రామపంచాయతీల ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. ఒక రోజు ముందే డప్పు చాటింపు చేయాలన్నారు. రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి అర్హుల జాబితా గ్రామసభల్లో ప్రకటిస్తామన్నారు. కార్య క్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఏవో, ఎంపీవో, డీటీ, ఏపీవో, కార్యదర్శులు, ఏఈవోలు పాల్గొన్నారు.

ఒకే పార్టీలో ఉండి విమర్శలు చేయడం సరికాదు



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి

చింతలమానేపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ఎమ్మెల్సీ దండె విఠల్, ఆయన వెంట తిరిగే మండల నాయకులపై విమర్శలు చేయడం సరికాదని జడ్పీ మాజీచైర్మన్ సిడాం గణపతి, మాజీఎంపీపీ నానయ్య అన్నారు. సోమవారం మండలకేంద్రంలో వారు మాట్లాడుతూ ఇటీవల రావిశ్రీనివాస్ ఇంటి ఎదుట కాంగ్రెస్ నాయకులతో దండె విఠల్ మంచోడు కానీ, ఆయన వెంట తిరిగే నాయకులు భూకబ్జాదారులని విమర్శలు చేయడం సబబు కాదన్నారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లాఅధ్యక్షుడు, గౌరవమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తాము కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్‌ల సమస్యలను పరిష్కరించాలి

మంచిర్యాల క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆర్టిజన్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మంచిర్యాల హైటెక్‌సిటీ ఎస్ఈ కార్యాలయం ముందు రిలేదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా టీబీజేఏసీ జిల్లాఅధ్యక్షుడు పసుల తిరుపతి మాట్లాడుతూ విద్యుత్ ఆర్టిజన్స్‌కు వెంటనే కన్వెర్షన్ ఇప్పించాలని, విద్యార్హతను బట్టి జేఎల్ఎం, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్‌గా పదోన్నతి కల్పించాలని, ఒకే సంస్థలో ఒకే రూల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.కార్యక్రమంలో తిరుమలరాజ్, జగన్,వెంకటేష్, ప్రకాష్, శ్రీనివాస్, వీరేంద్ర, రాజేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

రైతు భరోసా సర్వేను

పకడ్బందీగా నిర్వహించాలి

బెజ్జూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న రైతుభరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. సోమవారం మండలకేంద్రంలో కొనసాగుతున్న రైతు భరోసా సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుభరోసాను అర్హులైన వారందరికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు అర్హులఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఆమెవెంట తహసీ ల్దార్ భూమేశ్వర్, ఏవో నాగరాజు, ఆర్ఐ సంతోష్, ఏఈవోలు మీనా, మారుతి తదితరులు పాల్గొన్నారు.

రావి శ్రీనివాస్‌ను విమర్శిస్తే ఊర్కొనేది లేదు

చింతలమానేపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌ను విమర్శిస్తే ఉర్కొనేది లేదని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కనకయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. హర్షద్ హుస్సేన్‌తో పాటు ఇతర నాయకులు రావి శ్రీనివాస్‌ను వారి అనుచరగణంపై అనుచితవ్యాఖ్యలు చేశారన్నారు. మొదటి నుంచి మేము కాంగ్రెస్ జెండా మోస్తూ కాంగ్రెస్ పార్టీకి అండదండగా ఉంటూ అధికారంలో రావడానికి కృషి చేశామన్నారు. ఇప్పుడు కొందరు నాయకులు ఇతర పార్టీల్లో పనిచేసి ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీలోకి వచ్చి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, శంకర్, శంకరయ్య, షాహీద్, రమేష్, శ్రీను, మారుతి తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు సరికాదు

బెజ్జూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రావి శ్రీనివాస్‌పై విమర్శలు చేయడం సరికాదని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆత్రం రాజారాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ దండె విఠల్ అనుచరులు రావిశ్రీనివాస్‌పై చేసిన వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేకూర్చే విధంగా ఉన్నాయన్నారు. పార్టీలో కొనసాగుతున్న మరో నాయకుడిపై విమర్శలు చేయడం పార్టీ ధిక్కరణ కిందకు వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ హకీం, నరేందర్‌గౌడ్, జాయిద్ హుస్సేన్, రామకృష్ణ, రవి, సత్తయ్య, బాబురావు, విష్ణుమూర్తి, మురళీగౌడ్, దాసు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం క్యాలెండర్, డైరీని సోమవారం ఎమ్మెల్యే హరీష్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయదేవ అబ్రహం, కార్యదర్శి ఎం శివప్రసాద్, పైడి అంకయ్య, బి నర్సయ్య, షేక్ మహబూబ్, ఏఎస్ఆర్ మూర్తి, నర్సయ్య, ఇస్తారు పాల్గొన్నారు.

సిర్పూర్ కాంగ్రెస్‌లో వర్గవిభేదాలు

కాగజ్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సిర్పూరు కాంగ్రెస్‌లో వర్గవిభేదాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. తర్వాత వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు పెరిగిపోయాయి. తాముఎన్నికల సమయం నుంచి ఉన్నామని కొత్తగా వచ్చిన వారికి అధికప్రాధాన్యత ఇస్తున్నారని ప్రధానచర్చ జరుగుతోంది. తాజాగా కాంగ్రెస్‌పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్సీ దండేవిఠల్ అనుచరులు సరిగ్గాలేరని, గతంలో వివిధకేసుల్లో ఉన్నవారేనన్నారు. ఈ వర్గంపై ప్రజలు అసహనంతో ఉన్నారన్నారు. వెంటనే ఈవిషయాన్ని కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకపోవాలని సిర్పూర్‌నియోజకవర్గ ఇన్‌చార్జిరావిశ్రీనివాస్‌కు సూచించారు. రెండ్రోజుల క్రితం ఎమ్మెల్సీ దండే విఠల్‌కు చెందిన నాయకుడు, రాష్ట్ర టీపీసీసీ మెంబర్ అర్షద్ బెజ్జూరులో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఈ విషయాన్ని ఖండించారు. ఒకేపార్టీలో ఉంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవటం సరి కాదన్నారు. ఈ విషయంలో న్యాయం కోసం జిల్లా, రాష్ట్ర నాయకత్వాలున్నట్టు తెలిపారు. కేవలం అక్కసుతోనే ఇలాంటి చౌకబారు ఎత్తు గడులు చేస్తున్నట్టు తెలిపారు. త్వరలో జరిగే స్థానికసంస్థల ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌లో విభేదాలు రావటం చర్చనీయాంశంగా మారింది.ఈవిభేదాలపై అధిష్టా నం ఎలాస్పందిస్తుందోనని అంతా వేచి చూస్తున్నారు.



నైనీ బ్లాకు నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తాం

మందమర్రి టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఒరిస్సాలోని నైనీ బొగ్గు గనుల ద్వారా మార్చి నుంచి బొగ్గు ఉత్పత్తి చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం ఒరిస్సా రాష్ట్ర ముఖ్యమంత్రి చరణ్‌కు డిప్యూటీ సీఎం ఈ విషయం తెలిపినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఒరిస్సాలో చేపట్టే బొగ్గుకు సంబంధించి లేఖను కూడా అందజేశారు. గత సంవత్సరం జూలై 24న జరిగిన సమావేశం ఎప్పటికీ మర్చిపోలేమని గుర్తుచేశారు. నైనీ క్యాప్టివ్ బ్లాక్ అయినందున బొగ్గు గని నుంచి ఉత్పత్తి చేసిన బొగ్గును సింగరేణి జైపూర్ పవర్ ప్లాంటుకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. రవాణాఖర్చు తగ్గించడం, నాణ్యమైన విద్యుత్ సరఫరా, పర్యావరణ పరిరక్ష వంటి అంశాలపై గని నుంచి విద్యుత్‌ఉత్పత్తి లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రితో సీఎండీ బలరాం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

శ్రీరాంపూర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి స్థలాల్లో ఇళ్ల నిర్మించుకొని నివాసంఉంటున్న వారికి ఇళ్లపట్టాలు ఇవ్వాలని మంచిర్యాల మాజీఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సోమవారం ఆయన అరుణక్కనగర్‌లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తన ఆధ్వర్యంలో 2800పట్టాలు ఇచ్చామని, ఇంకా 1000వరకు పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పట్టాలు ఇవ్వడం లేదన్నారు. కృష్ణకాలనీ, ఆర్కే6 కాలనీ, ఇంకా కొన్ని ప్రాంతంలో దరఖాస్తు చేసుకొని పెండింగ్‌లో ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో తాము నస్పూర్ మున్సిపాలిటీకి 25కోట్ల రూపాయలు మంజూరు చేయిస్తే ప్రస్తుత ఎమ్మెల్యే రద్దు చేయించారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బన్న, ప్రధానకార్యదర్శి మేరుగు పవన్, కౌన్సిలర్ వంగ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బొమ్మల కొలువు

జైపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌లోని లేడీస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా బొమ్మలకొలువు నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిలుగా డైరెక్టర్(ఈఅండ్ఎం ఆపరేషన్స్) సత్యనారాయణరావు సతీమణి హరిణిసత్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్‌ప్లానింగ్ పర్సనల్) వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి సునీత వెంకటేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. తెలుగుప్రజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈబొమ్మల కొలుపు ఇప్పటికీ వన్నెతగ్గకుండా మహిళలందరూ ఉత్సాహంగా జరుపు కోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా లేడీస్ క్లబ్ సభ్యులు వేసిన రంగ వల్లులు, భోగి సెట్, బొమ్మలు ఆకట్టుకున్నాయి.

డంప్‌యార్డు ఎత్తివేసేదెప్పుడో...?

(5వ పేజీ తరువాయి)

మున్సిపాలిటీ పరిధిలోని కొంత స్థలం కేటాయించారు. స్థలం కేటాయించి ఏళ్లు గడుస్తున్నా అక్కడ చెత్తను డంప్ చేయకుండా మళ్లీ అండాళమ్మ కాలనీలోనే వేయిస్తున్నారు.

కాలుష్యంతో ఇబ్బందులు....

ఇదిలా ఉండగా అండాళమ్మ కాలనీలో డంప్ యార్డులో ఉన్న చెత్తను అక్కడి నుంచి ఎత్తివేసి కొద్ది రోజులుగా సమీపంలోని రహదారిని ఆనుకొని వేస్తున్నారు. జేసీబీ సహాయంతో చెత్తను రోడ్డు పక్కన వేస్తుండటంతో ఆ ప్రాంతమంతా కాలుష్యం వెదజల్లుతోంది. చెత్త తగులబెడుతున్న ప్రాంతానికి సమీపంలో నివాస గృహాలతోపాటు మిషన్ భగీరథ నీటి ట్యాంకు, పంక్షన్ హాళ్లు, స్పోర్ట్స్ క్లబ్, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఉన్నాయి. దుర్వాసన కారణంగా ప్రజలతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

డంప్ యార్డును తరలించాలి...



అశోక్, గ్రీన్‌సిటీ కాలనీ

రెండేళ్ల క్రితం గ్రీన్‌సిటీ కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాను. సమీపంలోని అండాళమ్మ కాలనీలో మున్సిపల్ డంప్‌యార్డు ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. పైగా చెత్తను కాల్చడంతో నల్లని దట్టమైన పొగలతో తీవ్రమైన కాలుష్యం బారిన పడాల్సి వస్తోంది. అధికారులు పట్టించుకోవడం లేదు.

అనారోగ్యం భారిన పడుతున్నాం...



సురేష్, గ్రీన్‌సిటీ కాలనీ

దుర్వాసన, నల్లని దట్టమైన పొగల కారణంగా కాలనీ వాసులం తరుచుగా అనారోగ్యం భారిన పడాల్సి వస్తోంది. చిన్న పిల్లల్లో శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాలనీలో సమీపంలో ఉన్న డంప్‌యార్డును తరలించాలని ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా చెత్తడంపింగ్‌ను నిలిపి వేయాలి.

నకిలీ వెంచర్ల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని..
ప్రజావాణిలో ఫిర్యాదు

తాండూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు కబ్జా చేసి నకిలీ వెంచర్లు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి ఫిర్యాదు చేశారు. బోయపల్లి నుంచి రేపల్లెవాడ వరకు ఐబీ చౌరస్తా నుంచి నర్సాపూర్ వరకు రోడ్డు వెంట ఉన్న అసైన్డ్ భూముల్లో ప్రభుత్వ అధికారుల సహకారాలతో వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

●స్థానిక సంస్థలు సమీపిస్తున్నందున జిల్లాలో వివిధ శాఖల్లో కొన్నేళ్లుగా తిష్టవేసుకుని కూర్చున్న ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే వేరే చోటకు బదిలీ చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మణిరాం సింగ్, టీడీపీ తాండూర్ మండల ఇన్‌చార్జీ దాసరి శ్రీనివాస్‌లో ఫిర్యాదు చేశారు. రెండేళ్ల పైబడి ఒకే చోట ఉద్యోగం చేస్తున్న వారిని వెంటనే బదిలీ చేయాలని కోరారు.



శిల్పారామంలో ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులతో భార్గవి

కూచిపూడి భార్గవి

● శిల్పారామంలో చిన్నారుల ప్రదర్శన..

హైదరాబాద్‌లోని శిల్పారామంలో ఇటీవల నిర్వహించిన నేషనల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ మేళా, సంక్రాంతి ఉత్సవాల ముగింపు వేడుకల్లో నస్పూర్‌లోని శ్రీ శార్వాణి కూచిపూడి నృత్యాలయంలో విద్యార్థులు పాల్గొన్నారు. భార్గవి ప్రేమ్ ద్వారా శిక్షణ పొందిన 20 మంది విద్యార్థులు నృత్యం ప్రదర్శించారు. చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యం చూపరులను ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు నిర్వాహకులు ప్రశంస పత్రాలను అందించారు.

- 750కి పైగా నృత్య ప్రదర్శనలు
- గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం...
- ప్రముఖుల ప్రశంసలు, అవార్డులు...

నస్పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆమె నృత్యాభినయం మహా అద్భుతం... కాలి అందెల సవ్వడి హృదయానందభరితం... శాస్త్రీయ నృత్యానికి జీవం... ఏ ప్రాంతంలోనైనా నృత్య కళా ప్రదర్శన ఇచ్చినా చూపరు లను ఆకట్టుకుంటోంది. దేశ విదేశాల్లో నృత్య ప్రదర్శన లు ఇస్తూ ఎన్నో రికార్డులను సొంతం చేసుకుంది నస్పూర్‌కు చెందిన గోనె భార్గవి.

2022లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డ్యాన్స్‌లో మాస్టర్ డిగ్రీని పూర్తి చేసింది. ఉన్నత చదువుతో పాటు నృత్యంలో రాణిస్తున్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు శ్రీలత-లక్ష్మినారాయణల ప్రోత్సాహంతో గురువు సీతా ప్రసాద్ వద్ద నృత్యం నేర్చుకుంది. రవీంద్ర భారతీ, శిల్పారామం, తిరుపతి బ్రహ్మో త్సవాలు, భరతముని జయంతి ఉత్స వాలు, కూచిపూడి, భద్రాచలం ముక్కోటి ఉత్సవాలు, న్యూఢిల్లీ ప్రగతి మైదాన్, త్యాగరాయ గాన సభ, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రదర్శనలిచ్చి బహుమతులు, ప్రశ ంసలు అందుకున్నారు.

● దేశ విదేశాల్లో ప్రదర్శనలు

దేశ విదేశాల్లో 750లకు పైగా ప్రదర్శనలు ఇచ్చి ఎన్నో అవా ర్డులు, ప్రశంసలు అందు కుంది భార్గవి.. ఆస్ట్రేలియా, లండన్, జర్మనీ, స్విట్జర్లాండ్, ఐర్లాండ్, నెథ ర్లాండ్, ఫ్రాన్స్ తదితర దేశాల్లో తెలుగు అసోసియేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. 2017లో వైట్ హౌజ్ ఆఫ్ లండన్ పార్లమెంట్‌లో ఘనంగా భార్గవిని సన్మానించారు. 2015లో ఆస్ట్రే లియా సిడ్నీలో తెలుగు అసోసి యేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది పురస్కారాల్లో ప్రదర్శన ఇ చ్చింది. 2010లో సిలికాన్ ఆంధ్ర గిన్నీస్ బుక్ ఆఫ్ వ రల్డ్ రికార్డులో స్థానం పొందింది. 2006 నుంచి వరుస గా 2010 వరకు కొత్తగూడెంలో జరిగిన జాతీయ స్థా యి బాలోత్సవ్ పోటీల్లో మూడు సార్లు ప్రథమ, ఒక సారి ద్వితీయ బహుమతులు సాధించారు. 2008లో దూరదర్శన్ సప్తగిరి చానల్ నిర్వహించిన చిరు మువ్వ ల సవ్వడిలో రాష్ట్ర స్థాయి బహుమతిని గెలుచుకున్నారు. టీటీడీ ఎస్‌వి చానల్ నిర్వహించిన శృతిలయలు నృత్య పోటీలో ఫైనలిస్ట్, 2016లో కొత్తగూడెంలో జిల్లా స్థాయి యువజనోత్సవంలో ప్రథమ స్థానం, 2017లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవంలో ద్వితీయ స్థానం సాధించారు. 2005లో అఖిల భారత సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో పునేలో నిర్వ హించిన పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచారు. 2017 లో అత్యుత్తమ ప్రదర్శనలిచ్చే విద్యార్థినులకు అందించే అతి విలువైన సత్యభామ జడ బహుమతిని గురువు సీతా ప్రసాద్ నుంచి అందుకున్నారు.



ఆస్ట్రేలియాలో బహుమతి అందుకుంటున్న భార్గవి

కళాకారులను తయారు చేయడమే లక్ష్యం
- గోనె భార్గవి



భారతీయ ప్రాచీన సాంప్రదాయ కళ అయినా కూ చిపూడి నృత్యంలో మరిన్ని విజయాలు సాధించడంతో పాటు ఆసక్తి కలిగిన వారిని కళాకారులుగా తయారు చేయడమే లక్ష్యం. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కూచి పూడి నృత్యం ప్రారంభించాను. భర్త సహకారంతో నృత్యాలయాన్ని ప్రారంభించి చిన్నారులకు శిక్షణ ఇస్తున్నా ను. వారితో అనేక ప్రదర్శనలు ఇస్తున్నాను. శ్రీ శార్వాణీ కూచిపూడి నృత్యాలయం స్థాపించి శిక్షణ ఇస్తున్నాను. నావద్ద శిక్షణ పొందే చిన్నారులు కూడా ఉన్నతస్థాయిలో నిలిచే విధంగా శిక్షణ ఇస్తాను. నేను 8వ ఏట నాట్యం ప్రారంభించారు. 20 ఏళ్ల నాట్య జీవితంలో 750 పైగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చా ను. 50 మంది చిన్నారులకు గజ్జె పూజ కార్యక్రమాన్ని ఇటీవల నిర్వహించాము. నృత్యంలో ఉన్నతస్థాయిలో ఎదిగే విధంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాము. మా నృత్యాలయంలో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అనేక చోట్ల కూచిపూడి ప్రదర్శనలు ఇస్తున్నారు.

నాటుసారా విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం
- సమ్మయ్య, లక్షెట్టిపేట ఎక్సైజ్ శాఖ ఇన్‌చార్జి సీఐ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: గుడుంబా నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

సీఐ: లక్షెట్టిపేట ఎక్సైజ్ శాఖ పరిధిలోని జన్నారం, దండేపల్లి, లక్షెటి పేట మండలాల్లో గుడుంబాస్థావరాలపై విస్తృత దాడులు చేసి గుడుంబా నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నాం. గ్రామా ల్లో గుడుంబా తయారీ చేసి విక్రయిస్తే వారిపై పీడీయాక్టు నమోదు చేస్తాం. బైండోవర్ ఉల్లఘించిన వారిపై లక్ష జరి మాన విధిస్తాం. జరిమాన కట్టని వారికి ఎడాది జైలు శిక్ష పడుతుంది.

ఆంధ్రజ్యోతి : ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వ హిస్తున్నట్లు సమాచారం, దీనిపై ఎలాం టి చర్యలు తీసుకుంటున్నారు.?

సీఐ: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మూడు మండలాల్లో బెల్ట్ నిర్వహిస్తున్న పలువు రిపై గతంలో కేసులు నమోదు చేశాము. బెల్ట్ షాప్‌పై ఫిర్యాదు వస్తే వారిపై చర్య లు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: లక్షెట్టిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వైన్స్ షాపుల్లో ఎమ్మార్పీ ధరలకు విక్రయిస్తున్నారు.?

సీఐ: లక్షెట్టిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట మండలాలు ఉన్నాయి. అందులో లక్షెట్టిపేట మండలంలోని 5, కరీంనగర్ చౌరస్తాలో ఒకబార్, దండేపల్లి మండలంలో ని 3, జన్నారం మండంలో 4తో కలిపి మూడు మండలాల్లోని 12 వైన్స్ షాప్‌లు ఉన్నాయి. ప్రతి వైన్స్ వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేశాము.

మందమర్రిలో అఖిలపక్షాల ర్యాలీ

ఎన్నికలు నిర్వహించాలని కమిషనర్‌కు వినతి

మందమర్రి టౌన్, జవవరి 20(ఆంధ్రజ్యోతి) : మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ సోమ వారం అఖిల పక్షం పార్టీ ఆద్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కోల్ బెల్ట్ రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా నాయకులు జె రవిందర్, మాయ రమేష్, ఆర్ వెంకన్నలు, ముల్కల్ల రాజేందర్ మాట్లాడుతూ ఎన్నికలు లేకపోవడం వల్ల పాలకవర్గం లేకపోవడంతో అభివృద్ధి కుంటు పడుతుందని పేర్కొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఎన్నికలు నిర్వహించాలన్నారు. మున్సిపాలిటీలో ప్రజలకు పరిపాలన సౌలభ్యం ఉండాలంటే ఎన్నికలు జరపాలన్నారు. తాము ఎన్నికల సాధనే లక్ష్యంగా అఖిల పక్షపార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్ పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. ఈ ఎన్నికల కోసం ఎమ్మెల్యేతో పాటు ఎంపీ, ఇతర అధికారులకు వినతి పత్రం అందజేస్తామని, డిల్లీకి వెళ్లి నాయకులను కలవనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.



వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల నిరసన

కన్నెపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు దాడి చేసిన కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం కన్నెపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లాప్రధాన కార్యదర్శి జయకృష్ణ, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు మోహన్, ఎస్‌టీయూ సంఘం నాయకుడు విశ్వనాథ్, నాయకులు సతీష్, శారద, శ్రీకాంత్, స్వర్ణలత, మోహన్, వహీద,సునీత పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

కాసిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ముత్యంపల్లిలోని హనుమాన్ ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ సోమవారం రూ. 10 వేల విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు షైదం రమేష్, గోపాల్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులకు ఎంపీ పరామర్శ

భీమిని, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకటాపూర్ మాజీ సర్పంచి దారిశెట్టి వెంకన్న కుటుంబ సభ్యులను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సోమవారం పరామర్శించారు. వెంకటాపూర్ గ్రామంలోని ఇంటికి వెళ్లి వెంకన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరఫున అండగా ఉంటామని వంశీకృష్ణ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. రెండు సార్లు సర్పంచిగా వెంకన్న గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఎంపీ కొనియాడారు. వెంకన్న మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎంపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాధవరపు నర్సింగరావు, భీమిని, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాదం లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, నాయకులు షైదం రమేష్, శ్రీధర్, నాయకులు ఉన్నారు.

కన్నెపల్లి : మండలంలోని జన్కాపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ ముసిపట్ల సత్తయ్య ఇటీవల మృతిచెందగా సోమవారం నిర్వహించిన దశదినకర్మకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు. సత్తయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబీకులను ఓదార్చారు. ఆయన వెంట సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింగరావు, కన్నెపల్లి, భీమిని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు రామాంజనేయులు, లక్ష్మీనారాయణ ఉన్నారు.

మందమర్రిటౌన్ : పట్టణంలోని పాత బస్టాండ్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నీలం కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుదర్శన్, బండి సదానందం యాదవ్, రాగిడి రాంరెడ్డి,

ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని ర్యాలీ

బెల్లంపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వెంటనే ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ మాదిగ హక్కుల దండోరా నాయకులు సోమవారం తిలక్ స్టేడియం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు మాదిగ మాట్లాడుతూ 30 ఏండ్లుగా అలుపెరుగని పోరాటాలు వర్గీకరణ కోసం చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్‌చేశారు.

ఎన్‌ఎంఎంకు ఎంపికైన ఉపాధ్యాయురాలు

కోటపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నూతన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ మిషన్ ఆఫ్ మానిటరింగ్ (ఎన్‌ఎంఎం)లో సభ్యురాలుగా దేవులవాడ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు నూగురి అర్చన ఎంపికయ్యారు. సోమవారం ఉపాధ్యాయురాలు అర్చనను ఘనంగా సన్మానించారు. ఎన్‌సీటీ ఈ-ఎన్‌ఎంఎం కన్వీనర్ దినేష్ చతుర్వేది ఈ మెయిల్ ద్వారా సమాచారం అందించారు.

రెండు రోజుల్లో గ్రామసభలు పూర్తి చేయాలి

లక్షెట్టిపేట, జనవరి,20 (ఆంధ్రజ్యోతి): నేడు రేపు రెండు రోజుల్లో అన్ని గ్రామాల్లో గ్రామ సభలను పూర్తి చేయాలని లక్షెట్టిపేట మండల ప్రత్యేక అధికారి సంజీవరెడ్డి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని గ్రామాల పంచాయితీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ సభల్లో చర్చించే అంశాలపై అధికారులకు కార్యదర్శులకు పలు సలహాలు సూచనలు అందజేసారు. ఈసభలు ఈనెల 21, 22 తారీకుల్లో పూర్తి చేసి నివేదికను అందజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో సరోజ, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శులు ఉన్నారు.

దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు ఈనెల 21నుంచి 23వరకు దండేపల్లి మండలంలోని 33 గ్రామ పంచాయతీలోని లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు దండేపల్లి మండల పరిషత్ అభివృద్ధి శాఖ అధికారి జేఆర్ ప్రసాద్ తెలిపారు. అధికారుల సమక్ష్యంలో సంక్షేమ పథకాల కోసం అర్హులైన లబ్దిదారులను ఎంపిక కోసం గ్రామసభ లు నిర్వహించ ఎంపిడివో వెల్లడించారు.

తాండూర్ : మండలంలో రైతు భరోసా, రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు సంబంధించిన గ్రామసభలను మండలంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌లు తెలిపారు. ప్రజలు హాజరు కావాలని కోరారు.

భీమిని : ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి గ్రామ సభలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ బికర్ణ దాస్, ఎంపీడీవో గంగ మోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఏఈవోలు, రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు.

ఆ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేష్, కార్యదర్శులు, ఏఈవోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

మందమర్రిటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియాలోని పనిచేస్తున్న సింగరేణి సెక్యూరిటీ గార్డులతో పాటు ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొర చూపాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఎస్అండ్‌పీసీ మైదానంలో వారిని కలిసి సమస్యలను అడిగి తెలు సుకున్నారు. ఈ మధ్య కాలంలో ఎస్అండ్‌పీసీల ఖాళీ భర్తీకి యాజమాన్యం చొరవ చూపకపోవడం సరైంది కాదన్నారు. దీంతో ఉన్న వారిపై పనిభారం పడుతుందన్నారు. సింగరేణి ఆస్తుల రక్షణ కోసం సెక్యూరిటీ గార్డుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీమనాధుని సుదర్శన్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఐక్యత సభను విజయవంతం చేయాలి

కన్నెపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22న భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో జరిగే ప్రగతి శీల యువజన సంఘం, విప్లవ యువజన సంఘం ఐక్యత సభను విజయవంతం చేయాలని ప్రగతి శీల యువజన సంఘం రాష్ట్ర కమిటీ నాయకుడు మనోహర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రాజన్న, సిద్దార్థ, రాజన్న పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలి

బెల్లంపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆరోగ్య సేవలను వెంటనే పునరుద్ధరించాలని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం పట్ట ణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పది రోజులుగా రాష్ట్రంలోని నెట్‌వర్కు ఆసుపత్రులన్నీ డయాలసిస్ లాంటి అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని రకాల సేవలు నిలిపివేశాయని, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కౌంటర్లను యాజమాన్యాన్ని మూసివేశాయమన్నారు. దీంతో నిరుపేదలకు వైద్యం అందడం లేదన్నారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రులకు బకాయిలను చెల్లించి ఆరోగ్య శ్రీ సేవలను పునరుద్దరించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు చందు, ఆకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంసీపీఐయూ నాయకులు

అర్చకుడికి జాతీయ పురస్కారం

తాండూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సంస్కృతి సాహితి ట్రస్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంస్థ ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన అప్పల వెంకటేశ్వర శర్మ పురోహిత రంగంలో చేస్తున్న సేవలకు పురోహిత రత్న పురస్కారం అందజేసి సత్కరించారు. ఈ నెల 19న విజయవాడంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని అందజేశారు.

అంత్యోదయ కార్డులు అర్హులకే ఇవ్వాలి

మందమర్రిరూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అంత్యోదయ కార్డులు అర్హులకే ఇవ్వాలని, అనర్హులకు ఇవ్వడం వల్ల అర్హులు నష్టపోతున్నారని పేర్కొంటూ తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు సోమవారం టీడీపీ పట్టణాధ్యక్షుడు వాసాల సంపత్ వినతి పత్రం అందించారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అర్హులైన పేదలకు అందించాల న్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలన్నారు.

మా గ్రామాన్ని కార్పొరేషన్‌లో కలపొద్దు..


- నర్సింగాపూర్ గ్రామస్థుల ధర్నా
- మూడు గంటల పాటు నిరసన

హాజీపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలోనే తమ గ్రామాన్ని ఉంచాలని, కార్పొరేషన్‌లో కలపొద్దని కోరుతూ సోమవారం నర్సింగాపూర్ గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. అంతకుముందు కాలినడకన ర్యాలీగా జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడానికి వస్తున్న గ్రామస్థులను పోలీసులు బలగాలను మోహరించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఏసీపీ ప్ర కాష్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే గ్రామస్థులకు న చ్చజెప్పే ప్రయత్నం చేశారు.. అయినా గ్రామస్థులు ధర్నాకు దిగ డంతో కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. దీంతో వారు రహదారిపై కాకాకుండా రోడ్డు పక్కన బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామంలో నిరుపేదలు ఉంటున్నారని కేవలం ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పొందుతున్నామని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుతో ఉపాధి పని కోల్పోతామని తెలిపారు. తమ గ్రామంలో గ్రామసభలు నిర్వహించ కుండా ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే గ్రామ కార్యదర్శి తీర్మానం చేసిందని ఆరోపించారు. నర్సింగాపూర్ గ్రామం పూర్తిగా గ్రామీణ వ్యవస్థగానే ఉందని సుమారు 600 మంది గ్రామీణ ఉపాధి, వ్యవసాయ, కూలీలు పంచాయతీలో ఉన్నారని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటైతే ఉపాధి హామీ చట్టం రద్దవుతుందని, దీని వల్ల 600 మంది వ్యవసాయ కూలీల బతుకులు ఆగం అవుతాయన్నారు. ఇంటి పన్నులు, పంపు బిల్లులు, చెత్త పన్ను విధిస్తారని, రైతుల సబ్సిడీలు రద్దవుతారని ఆ వేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ నుంచి తమ గ్రామాన్ని తీసే వర కు ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు.

తమకు కార్పొరేషన్ వద్దని నినాదాలు చేశారు. టెంటు, వంట సామగ్రి తెచ్చుకుని న్యాయం జరిగే వరకు ఇక్కడే ఉంటామని తేల్చి చెప్పారు. కలెక్టర్ రావాలి అంటూ మూడు గంటల పాటు నిరసన తెలపడంతో తహసీల్దార్, ఏసీపీలు కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకుని వెళ్లామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న గ్రామస్థులు



ప'రేషన్' కార్డులు

- మండలంలో రేషన్ కార్డుల జాబితాపై తీవ్ర విమర్శలు..
- జాబితాలో కనిపించని అర్హుల పేర్లు..
- సర్వేలో బయటపడుతున్న అధికారుల తప్పిదాలు..
- ఆందోళనలో దరఖాస్తుదారులు..



6

కూచిపూడి భార్గవి...

- 750కి పైగా నృత్య ప్రదర్శనలు
- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం...
- ప్రముఖుల ప్రశంసలు, అవార్డులు...


భార్గవి నృత్య ప్రదర్శన

7

నియామకం


లకావత్ ఈశ్వర్

లక్సెట్టిపేట, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థి సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా లక్సెట్టి పేట పట్టణానికి చెందిన లకావత్ ఈశ్వర్‌ను నియమించినట్లు ఆసంఘం జాతీయ అధ్యక్షుడు ఇందల్ రాథోడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపాడు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు ఈశ్వర్ అప్పగించి నందుకు జాతీయ అధ్యక్షుడితో పాటు రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపాడు.

మాల మహానాడు యువజన సంఘం కమిటీ..


నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

దండేపల్లి, జనవరి20 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల మాల మహానాడు వి భాగం యువజన సంఘం నూతన కమిటీని ఆ సంఘం జాతీయ అధ్యక్షులు జేఏసి ఛైర్మన్ గడమండ్ల చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు ఆదే శాల మేరకు సోమవారం దండేపల్లిలో ముఖ్యనాయకుల సమక్ష్యంలో నియమించారు. అధ్యక్షులుగా గుమ్మడి అరవింద్, మంచిర్యాల జిల్లా ప్రచార కార్యదర్శిగా ధార నర్సయ్యలను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కుంభాల రాజేష్, రాష్ట్ర అధికారి ప్రతినిధి భూపెల్లి మల్లన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్‌లు తెలిపారు. ఈసందర్భంగా వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దుమ్మ నారాయణ, చిన్నయ్య, రవికుమార్, మంత్రి దేవయ్య, భీమయ్య పాల్గొన్నారు.

డంప్‌యార్డు ఎత్తివేసేదెప్పుడో..


తగలబడుతున్న చెత్తనుంచి వెలువడుతున్న దట్టమైన పొగలు

- తీవ్ర దుర్గంధంతో ప్రజల అవస్థలు
- చెత్తను కాలుస్తుండడంతో వ్యాపిస్తున్న దట్టమైన పొగ
- డంప్‌యార్డు తరలించడంలో నాన్చుడు ధోరణి
- పర్యావరణ కాలుష్యంతో సమీప కాలనీ ప్రజలు ఇబ్బందులు

మంచిర్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపాలిటీలోని అండాళమ్మ కాలనీ మున్సిపల్ చెత్తతో కంపుకొడుతోంది. రహదారులు, ఇళ్లకు సమీపంలో చెత్త డంప్ చేస్తుండటంతో దుర్వాసనకు ప్రజలు వేగలేక పోతున్నారు. డంప్‌యార్డును ఎత్తివేయాలని కాలనీ వాసులు పలుమార్లు అనేక రకాలుగా ఆందోళనలు చేపట్టినప్పటికీ ఫలితం ఉండటంలేదు. ఫలితంగా కాలనీలోని ప్రజలు అనారోగ్యం బారిన పడాల్సిన పరి స్థితులు నెలకొన్నాయి. కాలనీలోని నివాస గృహాలకు సమీపంలో ఏర్పాటు చేసిన డంప్‌యార్డులో పట్టణంలోని 36వార్డులకు సంబంధించిన చెత్త వేస్తుండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది.

డంప్‌యార్డు తరలించడంలో నాన్చుడి ధోరణి...

మంచిర్యాల పట్టణానికి డంప్ యార్డు ఏర్పాటు చేయడంలో దశాబ్దాల కాలంగా జాప్యం జరుగుతూ నే ఉంది. డంప్ యార్డు కోసం హాజీపూర్ మండలం వేంపల్లి శివారు కొత్త చెరువు సమీపంలోని అటవీ ప్రాంతంలో సర్వే నంబర్లు 154,155,159లలో 21 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో ఉపయోగిం చారు. దుర్గందం వ్యాపించడంతో స్థానికులు అభ్యంతరం మేరకు అక్కడ చెత్తవేయడాన్ని నిలిపివేశారు. చుట్టూ ప్రహరీ లేక పోవడం మూలంగా వర్షాకాలంలో కుళ్లిన పదార్థాలు చెరువులోకి చేరే ప్రమాదం ఉన్నందున చెత్త డంప్‌ను నిలిపివేయాలని గ్రామస్థులు కొందరు హైకోర్టులో పిటీషన్ వేయడంతో మళ్లీ అండాళమ్మ కాలనీయే దిక్కయింది. పైగా ఆ భూములను ప్రస్తుతం ఇండస్ట్రియల్ హబ్ కోసం విని యోగిస్తుండటంతో అక్కడ భవిష్యత్తులో చెత్త డం పింగ్ చేసే అవకాశమే లేకుండా పోయింది.

కాలుష్యంతో అనారోగ్యాల భారిన ప్రజలు...

అండాళమ్మ కాలనీలో గుట్టలా పేరుకుపోయిన మున్సిపల్ చెత్తను సిబ్బంది గతకొద్ది రోజులుగా రాత్రుళ్ల కాల్చివేస్తున్నారు. దీంతో దుర్గంధం మరింత పెర గుతోంది. మంటల్లో నుంచి వెలువడే దట్టమైన పొగలతో కాలనీ అంతా కాలుష్యం కోరల్లో మునిగి పోతోంది. దుర్వాసనతో కూడిన దట్టమైన పొగల కారణంగా ఊపిరి పీల్చుకోలేని పరిస్థితులు ఉన్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. పొగ కారణంగా శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయి, తరుచుగా అనారోగ్యాలకు గురవుతు న్నామని వాపోతున్నారు. పెద్దమొత్తంలో చెత్తను తగు లబెడుతుండటంతో ఒక్క అండాళమ్మకాలనీయేగాక సమీపం లోని గ్రీన్‌సిటీ, పవర్‌సిటీ కాలనీలతోపాటు రంగంపేట, పాత మంచిర్యాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపని అధికారులు..

వేంపల్లి సమీపంలో చెత్త డంప్‌ను నిలిపివేసినప్పటి నుంచి అండాళమ్మ కాలనీ సమీపంలోని తాత్కాలిక డంప్ యార్డులో మున్సిపాలిటీ చెత్తను వేస్తున్నారే తప్ప, శాశ్వత పరిష్కారానికి కృషి చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాత్కా లిక డంప్ యార్డులుగా రాళ్ల వాగు ఒడ్డు, గోదావరి తీ రం, బైపాస్ రోడ్డు, అండాళమ్మ కాలనీ సమీపంలోని జాలా గుట్టలను ఉపయోగి స్తున్నారు. అక్కడ వేసే మున్సిపాలిటీ చెత్తతోపాటు చికెన్‌సెంటర్ల వ్యర్థాలు పేరుకుపోతుండటంతో మున్సి పల్ సిబ్బంది వారానికోసారి కాల్చి వేస్తున్నారు. వాటిని కాల్చే సమయంలో దట్టమైన పొగతోపాటు, తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆయాప్రాంతాల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. కాలనీవాసుల ఆందోళనలతో మంచిర్యాల పట్టణం కోసం నస్పూర్ ..

(తరువాయి 7లో)

వేతనాలు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పోస్ట్ మెట్రిక్ వర్కర్లు

నస్పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రీ మెట్రిక్ పోస్ట్ మెట్రిక్ హాస్ట ల్స్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారత కార్మికసంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) ఆధధర్వ్యంలో సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు అందించారు. ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం మాట్లాడుతూ జిల్లాలోని ప్రీ మెట్రిక్ పోస్ట మెట్రిక్ హాస్టల్స్ వీధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్, కుక్కులు, కామాటి, నైట్ వాచ్‌మెన్స్, స్వీపర్స్, స్కావెంజర్లు అవుట్ సోర్సింగ్ వర్కర్లకు ఏడు నెలలుగా వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతుందన్నారు. ప్రతినెల ప్రభుత్వం బడ్జెట్‌ను విడుదల చేయడం లేదన్నారు. వర్కర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏడునెలల వేతనాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ ఆందోళన కార్యక్ర మంలో నాయకులు వెంకటేశ్, సంపత్, వినీత్, రాజన్న, సదానందం, ప్ర శాంత్, రాజేశ్వరి, సునిత, లత, లక్ష్మి, అనిత, ప్రమీల, అనసూయ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కఇంచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌మోతిలాల్,ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా నస్పూర్, మందమర్రి, బెల్లంపల్లి,చంద్రవెల్లి, శ్రీరాంపూర్, జైపూర్, మంచిర్యాల, తాండూర్,రేచిని ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అఖిల పక్ష సంఘం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెండింగ్‌ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని అఖిలపక్షం నాయకులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఫిబ్రవరి 2న మంచిర్యాలలో తూర్పు జిల్లాల సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో హామీఇచ్చిన ప్రాణహిత, కుప్టి ప్రాజెక్టుల నిర్మాణం ప్రభుత్వం చేపట్టాలని, ఉమ్మడి జిల్లా పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలన్నారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షునిగా ఎన్నికల ముందు ఇంద్రవెల్లి సభలో కుంటాల జలపాతం ఎగువన కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తామని ప్రకటించారని, కానీ ఇప్పటి వరకు చేయలేదన్నారు. వెంటనే ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అఖిలపక్షం నాయకులు కలవని శంకర్, గోవర్ధన్, సంకె రవి, లాల్‌కుమార్, జయరావు, గోపినాద్, దేవరాజు, రాంచందర్‌రెడ్డి, జైపాల్‌సింగ్,దేవన్న, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలి


దీక్షలో పాల్గొన్న శాలివాహన పవర్ ప్లాంటు కార్మికులు, నాయకులు

మంచిర్యాల క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : శాలివాహన పవర్ ప్లాం ట్ మూసివేసి 26 నెలలు గడుస్తున్న యాజమాన్యం కార్మికుల రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించకపోవడంతో శాలివాహన పవర్‌ప్లాంట్ స్టాఫ్‌అండ్‌వర్కర్స్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కార్మికులకు రావలసిన బెనిఫిట్స్ చెల్లించే వరకు కంపెనీ కి సంబంధించిన భూములను ఎవరు కొనవద్దని రియల్ ఎస్టేట్ వ్యాపారుల ను కోరుతున్నామన్నారు. అదేవిధంగా శాలివాహన పవర్‌ప్లాంట్ యజమాని మల్కా కొమురయ్య గారు స్పందించి ఈనెల చివరి వరకు కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించాలి, లేని పక్షంలో కంపెనీకి సంబంధించిన భూ ముల లో గుడిసెలు వేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షులు కుంటాల శంకర్, ప్రధాన కార్యదర్శి నిమ్మరాజుల సత్యం, ఉపాధ్యక్షులు ఆనంద రావు, కోశాధికారి పెంటసత్యం, పూడెం రవి శంకర్, ఆసరి రాజయ్య, సిరిపురం తిరు పతి, కాయితి బుచ్చయ్య, మానెం శ్రీశైలం, శ్రీనివాస్, సత్యనారాయణ, ఎల్లయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : బన్సల్ కార్పోరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఐక్య విద్యార్థి సంఘాల ఆద్వర్యంలో మంచిర్యాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖఅధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలో అద్దె భవనంలో నిబంధనలకు విరుద్ధంగా బన్సల్ కార్పొరేట్ కళాశాల డే ఆండ్ రెసిడెన్షియల్ ఏసీ క్యాంపస్ అని ఏర్పాటుచేసి దందాను కొనసాగిస్తున్నా రన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థుల సమాచారం సేకరించి విద్యార్థులకు, తల్లి దండ్రులకు ఫోన్‌చేస్తూ వారిని మభ్యపెడుతున్నారన్నారు. నిబంధనలు తుంగలో తొక్కిన ఆ కళాశాలకు అ నుమతులు ఇవ్వకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘా ల నాయకులు జుమ్మిడి గోపాల్, బచ్చలి ప్రవీణ్‌కుమార్, రేగుంట క్రాంతి కుమార్, షైక్ సల్మాన్ పాషా, జాగిరి రాజేష్ పాల్గొన్నారు.


విద్యాధికారి వినతి పత్రం అందజేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

జైపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్ మెంట్ విడుదల చేయాలని పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు సికిందర్ కోరారు. సోమవారం జైపూర్‌లోని ప్రభుత్వజూనియర్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

దండేపల్లి, జనవరి20 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సోమవారం మండలంలోని తాళ్లపేట, లింగాపూర్, మ్యాదరిపేట గ్రామాలోని తెలంగాణ సాంస్కృతి సారథి కళాకారులచే ఆటపాటతో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. జాతీయ ఆరోగ్యమిషన్ ద్వారా అందిస్తున్న వైద్యసేవలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలద్వారా అందిసిన వైద్య సేవలపై ప్రజలకు ఆటపాటతో వివరించారు. అసంక్రమణ వ్యాదులు బిపి, షుగర్, క్యాన్సర్ లాంటి వ్యాదులపైన సంక్రమణ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా దోమలు పెరగడం వాటిని నిర్మూలించడానికి పుట్టకుండా చూసుకోవడానికి చే పట్టే చర్యలు, కుష్టు వ్యాధి, కుటుంబ నియంత్రణ, ఎయిడ్స్, హెచ్‌ఐవి ఇతర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారుల టిమ్ లీడర్ల లావుడ్యా రమేష్, కళాకారులు కృష్ణ, రాజతిరుపతి, సత్యం, సంతోష్, కృష్ణ ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో పార్టీల ఫ్లెక్సీలు తొలగించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మందమర్రి టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు రోడ్ల పక్కన పెట్టిన ఫ్లెక్సీలను తొలగిం చాలని కోరుతూ సోమవారం బీఆర్ఎస్ పార్టీ దాని అనుబంధ సంఘాల ఆద్వర్యంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు జె రవిందర్ మా ట్లాడుతూ రోడ్డుకు మధ్యలో పెట్టిన ఫ్లెక్సీలతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పెద్ద పెద్ద ఫ్లెక్సీలను అధికార పార్టీ వారు ఏర్పాటు చేశారని, నిబంధనలకు విరుద్దంగా కాదా అని ప్రశ్నిం చారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే పన్నులు చెల్లించాలని, ఆ ఫ్లెక్సీల రూపేనా ఎంత ఆదాయం వచ్చిందో తెలపాలన్నారు. దీనికి సం బంధించి ప్రజా ప్రయోజనాల కోసం దినిని వ్యతిరేకిస్తున్నట్లు తె లిపారు. ఈ కార్యక్రమంలో కొంగల తిరుపతిరెడ్డి, బండారి సూ రిబాబు, సంపత్, రాజశేఖర్, బోరిగం వెంకటేష్, ఎండి అబ్బా స్, మద్ది శంకర్, తోట సురేందర్, భూపెల్లి కనకయ్య, కొం డల్‌రావు, మటన్ శేఖర్, బట్టు రాజ్‌కుమార్, సీపెల్లి సాగర్, ముస్తఫా, పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట ఖాళీ ప్లేట్లతో ధర్నా..

నస్పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బెల్లంపల్లిలో గల వంద పడకల ఏరియా అనుపత్రిలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ వర్కర్లలకు వేతనాల చెల్లింపులో తీ వ్రమైన జాప్యం జరుగుతుందని ఆర్థిక భారంతో సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఖాళీ ప్లేట్లతో సీఐటీయు ఆద్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అధికారులకు అందించారు. నాయకులు మాట్లాడుతూ బెల్లంపల్లి వంద పడకల ఏరియా అనుపత్రిలో పని చేస్తున్న పెషేంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు, స్వీపర్స్, శానిటేషన్ వర్కర్లకు వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడం, ఈఎస్ఐ, పీఎఫ్‌సౌకర్యాలను సక్రమంగా చెల్లింపులు లేవన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదునెలల వేతనాలు చెల్లించాలని, కోత విధించిన పీఎఫ్, ఈఎస్ఐలను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. జీవో నంబరు 60ను అమలు చేయని ఏజెన్సీపై చట్ట రీత్యా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, నాయకులు మల్లేశ్వరి, అన్వేష్ శ్రీకాంత్, లక్ష్మి, రమేష్, అక్బర్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The General public is hereby informed that our clinet Shriram Finance Limited, Mancherial Branch, Mancherial Dist is dealing with financing business in the course of business Sri Raja Lingam Deekonda S/o. Rajanarsu, age : 62yrs, Occupation Business, Promises No. 27-2-21, Peddampalle locality station Road area Adilabad district.

House bearing No. 27-2-21 admesuring to an extent of 2046 Sq.yards, out of Sy.No. 5, situated at station area locality of Peddampalle Village, Kasipet mandal Mancherial District Registration District : Adilabad & Sub-District Mancherial having the following the boundaries East : Road, West : Potte Ravi, North : Kalvala Pasaham, South : Samala Ramchander

towards security for the loan availed by her. If any person or persons having any claim, right, title or interest in the above said property may approach the undersigned within 7 days from the date of this publication or else our clinet will proceed with the transaction.

Pinninti Ashok,
Advocate legal Advisor
3-7-852/1, Vavilalapally, Karimnagar.
Cell: 98493 31558

సదా మీ సేవలో ఆంధ్రజ్యోతి

అ చిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి **చందాదారులు** గా చేరాలనుకుంటున్నారా!

అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితె చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు.

పత్రిక పంపిణిలో మీకు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

మంచిర్యాల : 94929 68431
బెల్లంపల్లి : 77806 58811
కుమ్రంభీం ఆసిఫాబాద్ : 84639 54674
C.O : 99854 11276

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్